05ATP14_05ATP14.qxd 14-10-2024 PM 11:13 Page 1



## శ్రీవాసవిమాతకు వజ్రాలహారం



వాసవిమాతకు వజ్రాలహారాన్ని అలంకరించిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన శ్రీవాసవికన్యకాపరమేశ్వరికి 25 లక్షల రూపాయల విలువైన వజ్రాల హారాన్ని అలంకరించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దాతల సహకారంతో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్ తెలిపారు. సోమవారం అమ్మవారు వాసంబికాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పట్లుపీతాంబరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు అమ్మవారి మంగళహారతులు పట్టారు. యువకులు ఉత్సాహంగా బాణసంచా పేల్చుతూ ముందుకు సాగారు. సాంప్రదాయబద్ధంగా జరిగిన ఈ ఉత్సవంలో చిన్నాపెద్దా తేడా లేకుండా పట్టణ ప్రజలు పాల్గొని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులు వంకదార చిన్నమద్దులేటి, కార్యదర్శి జయవరం అశ్వర్థరంగయ్య, సంయుక్త కార్యదర్శి భూమా సుబ్రమణ్యం, కోశాధికారి కుప్పం రత్నమయ్య, భక్తులు పాల్గొన్నారు.

## స్కేటింగ్‌లో సత్తాచాటిన తాడిపత్రి విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

అనంతపురంలోని 36వ ఇంటర్ డిస్టిక్ ఛాంపియన్‌షిప్ మాక్ రోలర్ స్కేటింగ్ అకాడమీలో జరిగిన సెలక్షన్లలో తాడిపత్రికి చెందిన శివ స్పీడ్ స్కేటింగ్ అకాడమీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. ఇందులో బిల్లివికారెడ్డి గోల్డ్, సిల్వర్, ఉమర్ 2 సిల్వర్, సునైనా గోల్డ్, సిల్వర్, మనోహర్ 2 గోల్డ్, 1 బ్రాంజ్, ప్రకృతి రెండు సిల్వర్లు, ముక్తేశ్వరి 3 గోల్డ్, అనిరుద్ 3 సిల్వర్, షర్మిల 2 గోల్డ్, ఉజ్వల్ 3 సిల్వర్, వినయ్ 2 సిల్వర్, 1 బ్రాంజ్, కార్తిక 4 గోల్డ్, ఇంతియాజ్ 1 బ్రాంజ్ సాధించినట్లు కోచ్ శివ తెలిపారు.

## ఇసుక మాఫియాను అరికట్టండి



కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫీయాను అరికట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫీయాను అరికట్టడంతో పాటు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో పెన్నానదిలో భూగర్భజలాలు అడుగంటిపోయి తాడిపత్రి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లతో రవాణా చేస్తుండడంతో రజకులు దుస్తులు ఉతకడానికి నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం కేటాయించి గృహ నిర్మాణవసతి కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పురుషోత్తం, రామేశ్వర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, సురేష్, సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు, లింగమయ్య, గంగావతి, తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖ కవచాలంకరణలో శ్రీబుగ్గరామలింగేశ్వరుడు

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామికి సోమవారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు పరమేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని పంచముఖకవచంతో పాటు వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మ, గంగాధర్‌శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

## రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఏఓ శ్రీహరినాయక్



**తనకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

వాతావరణ, విపత్తు నిర్వహణ శాఖల హెచ్చరికల మేరకు అల్పపీడన ప్రభావంతో మన జిల్లా నందు భారీ వర్ష సూచన ఉండటం వలన మరియు ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడం వల్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సాగులో ఉన్న పంటలను, ప్రస్తుత పరిస్థితుల్లో పంట కోతలు చేయకుండా, వర్షాలు తగ్గిన తర్వాత మరియు కొంచెం ఎండ పడిన తర్వాత పంట కోతలు చేపట్టాలని తెలియజేశారు. ఎక్కడ ఐతే వర్షం పడి నీరు నిల్వ ఉందో అక్కడ గట్లను కోత కోసి, కాలువలను ఏర్పాటుచేసి నీరు నిల్వ ఉండకుండా తమ తమ పొలాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ సూచించారు. అలాగే చెట్ల కింద ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్ తెలిపారు.

## వైభవంగా గరుడోత్సవం



**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

పట్టణంలోని పురాతన శ్రీచింతల వేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు మురళిస్వామి శ్రీదేవి, భూదేవి సమేత చింతలరాయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడవాహనంపై ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

## చిన్నపొలమడలో పల్లె పండుగ కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

**తాడిపత్రిరూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు చిన్నపొలమడలో నిర్వహించారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి చొరవతో గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి 20 లక్షల రూపాయాలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిచెర్ల లావణ్య, ఎంపిడిఓ ఫజీల్, పంచాయతీ సెక్రటరీ నరేంద్ర, మండల ఇంజనీర్ సురేష్‌రెడ్డి, నిర్మలానందరెడ్డి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 4 గ్రామాల్లో పల్లె పండుగ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలంలోని కందికాపుల, ఏ.కొండాపురం, కడవకల్లు, సూరేపల్లి గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో సిసి రోడ్లకు ఆయా పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసిలు భూమిపూజ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సౌకర్యాలు కల్పించేందుకు మొదటి విడతగా సిసి రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అలివేలమ్మ, మండల ఇంజనీర్ నరేంద్ర, ఏపిఓ చెన్నకేశవులు, ఇసి విజయనాగేంద్రరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

**పుట్లూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ

మండలంలోని చెర్లోపల్లి, శనగల గూడూరు గ్రామాల్లో సోమవారం ఏఓ కాత్యాయిని ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చెర్లోపల్లి గ్రామంలోని రైతు మల్లికార్జున రావు మొక్కజొన్నపంట పొలంలో 5 ఇంటు 5 నిష్పత్తిలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 30.250 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. అలాగే రైతు శివశంకర్ పొలంలో 10.750 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. అలాగే శనగలగూడూరులోని రైతు మధుసూదన్ సాగుచేసిన సోయాచిక్కుడు పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కాత్యాయిని, ఏఇఓ హరి, విహెచ్ఎ రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాపై అధికారులు సన్నాహాలు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

**పుట్లూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాలకు శాశ్వత నీటి సౌకర్యం కల్పించేందుకు గండికోట నుండి పంపింగ్ ద్వారా సరఫరా అవుతున్న నీటిని అందించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. తాడిపత్రి మండలం దిగువపల్లి గ్రామ సమీపంలో వున్న సంపు నుండి పైపులైన్ వేసిన విషయం తెలిసిందే. కాగా అక్కడి నుండి రెండు గ్రామాలకు నీరు అందించే విధంగా ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీరాములు పైపులైన్‌ను పరిశీలించారు. త్వరలో రెండు గ్రామాలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు శివరామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రంగనాథ, తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురు రక్తదానం

**అమడగూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలంలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో వుంటున్న కుమార్ అనే వ్యక్తికి అత్యవసరంగా ఆపరేషన్ చేయడానికి రక్తం అవసరమని డాక్టర్ తెలపగా జనసేన పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యనిర్వహణ కమిటీ సభ్యుడు లక్ష్మణ్, గాండ్లపెంటకు చెందిన సురేష్‌లు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. దీంతో ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి లక్ష్మణ్, సురేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

## సీతారాముల గుడి నిర్మాణం కోసం విరాళం



ఆలయ కమిటి సభ్యులకు గుడి నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న గంగాదేవి

**నల్లచెరువు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

నల్లచెరువు మండలంలోని నూతనంగా నిర్మించబడుగున్న సీతారాముల గుడి దేవస్థానమునకు భక్తులు విరాళాలు స్వీకరిస్తున్నారు. క్రీస్తు శేషులు చాగలేరు గంగన్న రిటైర్డ్ టీచర్‌గా గంగులమ్మ వీరి జ్ఞాపకార్థం వీరి కుమార్తె మరియు అల్లుడు శ్రీమతి పలకగంగాదేవి భర్త చెన్నకృష్ణప్ప కుమారులు నల్లమాట మడలంలో వీరు రూ.5,016విరాళము సీతారాముల గుడికి ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు.

## ఘనంగా జె.సి ధీర్‌దివాకర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

తాడిపత్రి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి తనయుడు, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి మనవడు జె.సి ధీర్‌దివాకర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం టిడిపి మైనార్టీ పట్టణాధ్యక్షులు అబ్దుల్‌రజాక్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరమణమహర్షి విద్యాలయం, శ్రీకృష్ణ వృద్ధాశ్రమంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. అదేవిధంగా మహిళలకు చీరలు, పురుషులకు పంచె షర్ట్ అందచేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పలకలు, అట్టలు, జామెంట్రీబాక్స్‌లను అందచేసి కేక్ కట్ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ స్టేట్ సెక్రటరీ అయూబ్‌బాష, మైనార్టీ నాయకులు నూర్‌బాష, ఎస్ఆర్ వాటర్ ప్లాంట్ అధినేత కందన్, స్నేహితులు, జె.సి అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## మట్కా నిర్వాహకుడు అరెస్ట్

**యల్లనూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో మట్కా నిర్వహిస్తున్న లద్దు సురేష్ అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు. గ్రామంలో మట్కా నిర్వహిస్తున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి మట్కా నిర్వహిస్తున్న లద్దు సురేష్‌ను అదుపులోకి అతని వద్ద నుండి 20 వేల రూపాయల నగదులో పాటు మట్కా పట్టీలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ద్విచక్రవాహనం చోరీ

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

పట్టణంలోని పుట్లూరు రోడ్డులోని రాజమోహన్‌రెడ్డి అపార్ట్‌మెంట్ ముందు ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ప్రముఖ అకౌంటెంట్ దూదేకుల మస్తాన్ పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు రాజమోహన్‌రెడ్డి అపార్ట్‌మెంట్ ముందు ఆపి వున్న కెటిఎం డ్యూక్ కెఎ05జెఎం6273 నెంబర్ గల వాహనం ఆదివారం రాత్రి చోరీకి గురైందని బాధితుడు తెలిపారు.

## అల్పపీడనం కారణంగా రైతులు జాగ్రత్తలు పాటించాలి - ఏఓ

**పుట్లూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

రాబోయే నాలుగు రోజుల పాటు అల్పపీడనం కారణంగా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కాత్యాయిని పేర్కొన్నారు. ప్రస్తుతం వేరుశనగ పంట కోత దశలో వుందని పంటకోతను వర్షాలు తగ్గే వరకు వాయిదా వేసుకోవాలన్నారు. ఒకవేళ కోత జరిగి వుంటే ఎత్తైన ప్రదేశంలో తార్పాలిన్ కప్పి వుంచాలన్నారు. పొలాల్లో కాలువలను ఏర్పాటు చేసుకుంటే అదనపు నీటిని నిర్వహిబచడంతో పాటు పొలాల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు సహాయపడుతుందన్నారు. 80 శాతం పక్వానికి వచ్చిన పంటలను వెంటనే కోయడం వల్ల నష్టాన్ని తగ్గించడానికి వీలవుతుందన్నారు. పండించిన పంటలను సురక్షితమైన స్థలంలో వుంచాలన్నారు. నీరు నిలబడి వున్న పంట పొలాల నుండి అదనపు నీటిని తీసివేసి చెరుకు. మొక్కజొన్న, అరటి మొక్కలు, కూరగాయలు, పండ్ల మొక్కలకు యాంత్రిక మద్దతు చేయడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు. వర్షం నీరు ఎక్కువ సేపు పొలాల్లో వుంచరాదని దీని వల్ల పంట కుళ్లిపోవడంతో పాటు తెగుళ్ల వచ్చేందుకు అవకాశం వుంటుందని ఆమె తెలియచేశారు.

## రెడ్డి బ్రదర్స్‌ను వేరు చేయడం ఎవరితరం కాదు

- మేము ఎప్పటికీ ఒక్కటే ...... మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి



జిల్లా బీజేపీ కార్యాలయంలో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించి సత్కరించిన బీజేపీ నాయకులు

**బళ్లారి, అక్టోబర్14, ప్రభాతవార్త**

మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయానికి సోమవారంనాడు తన భార్య లక్ష్మిఅరుణ, సోదరుడు మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డితో కలిసి తొలిసారిగా జిల్లా బీజేపీ కార్యాలయంలోకి అడుగుపెట్టారు. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో బళ్లారి జిల్లాలోకి ఎంట్రీ ఇచ్చిన గాలి జనార్ధన్‌రెడ్డి, నగరంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అయితే జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలోకి సోమవారంనాడు తన సోదరుడు గాలి సోమశేఖర్‌రెడ్డితో కలిసి చేరుకోవడంతో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా తదితర పదాధికారులు గాలి జనార్ధన్‌రెడ్డి దంపతులను సాదరంగా పార్టీ కార్యాలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంలో మాట్లాడిన గాలి జనార్ధన్‌రెడ్డి ఎన్నికల సందర్భంలో తన సోదరులతో విరుద్ధంగా పోటీ చేసి ఉండొచ్చు, అయితే సోదరులుగా తాము ఎప్పటికీ కలిసే ఉంటామని, మమ్మల్ని ఎవరూ విడదీసే ప్రశ్నేలేదని, జిల్లాలో మరొకసారి బీజేపీ పునః వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని, మీ అందరి సహకారం అవసరమని చెప్పారు. సభలో బీజేపీ నాయకులు డా.ఎస్‌జేవి మహిపాల్, ఎస్.గురులింగన్నగౌడ, గోనాళ్ రాజశేఖర్‌గౌడ, హెచ్.హనుమంతప్ప, ఓబులేష్, మాజీ మేయర్ డి.వెంకటరమణ, బుడా మాజీ అధ్యక్షుడు దమ్మూరు శేఖర్, మారుతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపిపి



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపిపి

**ముదిగుబ్బ, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి ఆదినారాయణయాదవ్ పేర్కొన్నారు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దచిగురురేవు, ఉప్పలపాడు, రాళ్ల అనంతపురం, నల్లచెర్లోపల్లి గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 14 నుండి 20 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ సమస్యలపై తాగునీరు. రోడ్ల నిర్మాణాలు, తదితర సంక్షేమ పథకాలను అమలు పరిచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా సిసిరేవు, ఉప్పలపాడు గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మహాత్మాగాంధీ ఉపాధి హామి పథకం ద్వారా ఇంకుడు గుంతలకు భూమిపూజ చేశారు. రాష్ట్రంలో మునుపెన్నడూలేని విధంగా డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పంచాయతీల అభివృద్ధికి నడుం బిగించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంపిడిఓ విజయభాస్కర్, ఇఓఆర్‌డి దివాకర్, ఏఓ రంగారెడ్డి, మండల బిజెపి నాయకులు ఓబిరెడ్డి, బిజెపి మండల కన్వీనర్ సోముల ప్రకాష్, జిల్లా కార్యదర్శి బిల్లు కుళ్లాయప్ప, రామాచారి పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

**అమడగూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**



విద్యుత్ తీగలను చూపుతున్న గ్రామస్తులు

మండలంలోని ఏ.వుట్టవాండ్లపల్లి గ్రామంలో దాదాపు నాలుగు ఇళ్లపైన విద్యుత్ తీగలు తాకుతుండడంతో ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ తీగలను పైకి లాగి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నాలుగు పంచాయితీలలో పల్లె పండుగ



గొల్లపల్లితాండాలో సీసీ రోడ్‌కు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**తలుపుల,అక్టోబర్14,ప్రభాతవార్త**

మండలపరిదిలోని నాలుగు పంచాయితీలలో అధికారులు పల్లె పండుగ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బాగంగా ఉడమలకుర్తి పంచాయితీలో నాలుగు పనులు, కుర్లి పంచాయితీలో మూడు పనులు, గొల్లపల్లితాండాలో ఒక పనికి, ఓదులపల్లిలో ఒక పనికి 55లక్షలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం పల్లెలే పట్టు కొమ్మలు అని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామానాయక్, ఎపిఓ హారూన్‌రషీద్, గ్రామ సర్పంచ్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా పశువుల నీటి తొట్టెలు

**తలుపుల,అక్టోబర్14,ప్రభాతవార్త:**



ఖాళీగా దర్శనమిస్తున్న నీటి తొట్టెలు

మండల వ్యాప్తంగా ప్రభుత్వం మండలంలోని దాదాపు అన్ని పంచాయితీలోని గ్రామాలలో పశువులు నీరు త్రాగడానికి నీటి తొట్టెలను లక్షలు వెచ్చించి నిర్మాణం చేశారు, అయితే అవి నేడు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. డి,డబ్ల్యుఎం,ఎ నిధుల క్రింద గతంలో గ్రామ సర్పంచులు నిర్మించడం జరిగింది. నీరున్న గ్రామాల్లో కూడా నీరు నింపడం లేదు. ప్రభుత్వం అంత డబ్బులు ఖర్చు పెట్టి వాటి నిర్మాణాలు ఎందుకు చేపట్టినట్లని పలువురు రైతులు విమర్శలు చేస్తున్నారు. ఇప్పసటికైనా అధికారులు స్పందించి నీరు వదిలే విదంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

## వైన్‌షాపును సొంతం చేసుకున్న రామచంద్రారెడ్డి

**అమడగూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండలలోని ఆకులవారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి అలియాస్ రామ్‌లాల్ సిండికేట్ మెంబర్ల ఆధ్వర్యంలో అమడగూరు వైన్‌షాపును టెండర్లలో సొంతం చేసుకున్నారు. అమడగూరులో వైన్‌షాపు నిర్వహిస్తామని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు కడపల కృష్ణారెడ్డి, కంచనగారిపల్లి రాజారెడ్డి, కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## బ్రాందీ షాప్ దక్కించుకున్న బాగేపల్లి చలపతి

**తనకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో బ్రాందీ షాపును లాటరీ ద్వారా విజయం దక్కించుకున్న బాగేపల్లి చలపతి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి బ్రాండ్ల మద్యం తెప్పించి మందుబాబులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తానని, నాణ్యమైన మద్యపానాన్ని తెస్తానని ఆయన తెలిపారు.

## తుఫాన్‌పై ఆశలు పెట్టుకున్న అన్నదాతలు

**తలుపుల,అక్టోబర్14,ప్రభాతవార్త:**

14వతేదీ నుంచి 16వతేదీ వరకు పొంచి ఉన్న తుఫాన్‌పై మండల రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడు ఇంతవరకు సరైన వర్షాలు పడకపోవడంతో రైతులు వేసుకున్న పంటలు చేతికందే పరిస్థితి లేదు. కనీసం పశువులకు పశుగ్రాసం అయినా పడుతుందని ఆశ పడుతున్నారు. తీవ్ర కరువుతో అల్లాడుతున్న అన్నదాతలు, ఈ తుఫాన్‌తో మంచి వానలు పడితే చెరువు, కుంటలు కాల్వలు నిండి పొర్లితే బోర్లు, బావులలో నీరు వస్తే పంటలు పెట్టుకోవచ్చని ఆశపడుతున్నారు.

06ATP27_06ATP27.qxd 14-10-2024 PM 10:36 Page 1



## గల్లంతయిన యువకుని శవం లభ్యం

### - మృతుని కుటుంబీకులను పరామర్శించిన మంత్రి

పెనుకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



ఘటనా స్థలంలో మృతదేహాన్ని సందర్శించిన మంత్రి సవిత

మండల పరిధిలోని గొల్లపల్లి రిజర్వాయర్లో నిన్న ఈతకెళ్లి గల్లంతయిన మండలంలోని అమ్మవారుపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహం సోమవారం లభించింది. మృతుడు ఆదివారం మిత్రులతో కలిసి రిజర్వాయర్లో ఈతకెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం పోలీసులు ఫైర్ సిబ్బంది బాగా పొద్దుపోయేదాకా గాలిచ్చినా ఫలితం లేకపోయింది. తిరిగి సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం దొరికింది. సంఘటనను తెలుసుకున్న రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, చేనేత జౌళిశాఖ మాత్యులు ఎస్.సవిత ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తదనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు రామాపురం విద్యార్థులు

బత్తలపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు మండలంలోని రామాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మినారాయణలు తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అన్నమయ్య, తూర్పుగోదావరి జిల్లాలో నవంబర్, డిసెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో అండర్ 14 విభాగంలో పాఠశాలకు చెందిన ప్రణీత, అండర్ 17 బాల, బాలకల విభాగంలో ఇబ్రహీం, దనుష, చందనలు ఎంపికయ్యారన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## గుత్తి సబ్‌రిజిస్ట్రార్‌గా మహబూబ్‌అలీ

గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన దృశ్యం

గుత్తి సబ్‌రిజిస్ట్రార్‌గా మహబూబ్‌అలీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గురునాథ్ శింగనమలకు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహబూబ్‌అలీని కార్యాలయం సిబ్బంది, దస్తావేజులేఖరులు బండి సత్య, శ్రీకరం, నరేష్‌రాయల్, రఘువీర్, అనంత, రమణ, రామకృష్ణ, రంగస్వామి, ఈలూ, తాజుద్దీన్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు

### -కమీషనర్ జబ్బార్‌మియా

గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



కమీషనర్ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతలంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణశాఖ తెలిపిందన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే 9100986902, 9100986895కు ఫోన్ చేయాలని ప్రజలను సూచించారు. లోతట్టు ప్రాంతాల వారు జాగ్రత్తగా వుండాలన్నారు. అలాగే జెసిబిలు ఇతర వాహనాలను సిద్ధంచేశామన్నారు. కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కర్నూల్‌రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, గుత్తి ఆర్ఎస్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలు అవసరమైతే వీటిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన అడిషనల్ సిడిపిఒ

గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ సిడిపిఒ

గుత్తి ఆర్ఎస్‌లోని చంద్రప్రియనగర్‌లోని అంగన్‌వాడి కేంద్రాన్ని సోమవారం ఐసిడిఎస్ అడిషనల్ సిడిపిఒ నాగమణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టిక, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు చక్కటి బోధన అందిస్తున్న అంగన్‌వాడి కార్యకర్త మహాలక్ష్మిని అభినందించారు. విద్యార్థుల హాజరు శాతాన్నిపెంచాలని విద్యార్థులకు రైమ్స్ ద్వారా బోధన అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్త మహాలక్ష్మి, ఆయా పుష్పవతి పాల్గొన్నారు.

## ఉచిత డిఎస్సీ శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సాంఘీక సంక్షేమ అధికారి శ్రీరాములు

ఏపి సాంఘీక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత డిఎస్సీ శిక్షణ కొరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ అధికారి శ్రీరాములు సోమవారం ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు ఈ నెల 21 తేదీలోపు జన్మభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎస్టీలకు ఇంటర్మిడియెట్‌తోపాటు డైట్ సెట్ స్కూల్ అసిస్టెంట్‌లకు డిగ్రీ గ్రాడ్యుయేట్ బిఈడి టెట్ కలిగిన వారు 2,50,000 ఆర్థిక ఆ దాయం కలవారు మాత్రమే శిక్షణకు అర్హులని అట్టి అభ్యర్థులు దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 21 తారీఖు ఆఖరి గడువు అని 22 నుంచి 25 వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగలరని 27 తారీఖున కోచింగ్ సెంటర్లు ప్రకటిస్తారని నవంబర్ 3 నుంచి మూడు నెలలపాటు ఉచిత కోచింగ్ శిక్షణ ఇ వ్వబడునని కోచింగ్ సమయంలో అభ్యర్థులకు భోజన వసతి సౌకర్యం కల్పించబడునని సహాయ సాంఘీక సంక్షేమ అధికారి శ్రీరాములు వెల్లడించారు.

## సమన్వయంతో నష్ట నివారణ చర్యలు చేపట్టండి

### - 16, 17 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతోంది - అధికారులతో సమీక్షా సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు

ఈనెల 16, 17 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని నియోజకవర్గంలోఆస్తి, ప్రాణ నష్ట నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు ఆదేశించారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెలుగుప్ప మండలాల వివిధ శాఖల అధికారులతో భారీ వర్షాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షపు నీరు ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందే పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లకు తరలించాలన్నారు. పంట నష్టం జరుగకుండా రైతులకు సూచనలు చేయాలన్నారు. రోడ్లు, కాలువలు, బిడ్జీలు తెగిపోకుండా అవసరమైన మందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. శిధిలమైన ఇళ్లు, భవనాల్లో ఎవరైనా కాపురం ఉంటుంటే వాటిని ఖాళీ చేయించాలన్నారు. పునరావాస శిబిరాల్లో ప్రజలకు ఆహారం, నీరు ఇతరత్రా సౌకర్యాలు కల్పించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రవాణా సౌకర్యానికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూలీపోయి ప్రాణ, ఆస్థి నష్టం జరుగకుండా చూడాలన్నారు. అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలన్నారు. మండలాల్లో జేసీబీలు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ రవిప్రసాద్, ఫైర్ ఆఫీసర్ భీమలింగయ్య, హార్టికల్చర్ అధికారి నెట్టికంఠయ్య, ఏవో శుభకర్, ఆర్‌అండ్‌బీ జేఈ కావ్య, ఇతర మండలాలకు చెందిన తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంఈఓలు, గృహనిర్మాణశాఖ అధికారులు, ఉపాధిహామీ, ఐసీడీఎస్, ఆర్టీసీ, విద్య, ఆరోగ్యం, పశుసంవర్ధక, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉరవకొండ మండలంలో అట్టహాసంగా 'పల్లె పండుగ'

### - రూ.4.31 కోట్లతో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త



ఉరవకొండ పట్టణంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జరిగిన భూమిపూజ కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల 'పల్లె పండుగ' కార్యక్రమం ఉరవకొండ మండలంలో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఉరవకొండ పట్టణంతోపాటు మండల పరిధిలోని ఇంద్రావతి, బూదగవి, రాయంపల్లి, లత్తవరం, లత్తవరం తండా పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమాలు కొనసాగాయి. మండలంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు 4.31 కోట్ల రూపాయలు కేటాయించిన విషయం తెలిసిందే. ఉరవకొండ పట్టణంలో 1.54 కోట్ల రూపాయలతో రోడ్ల నిర్మాణాలు జరుగనుండగా తొలిరోజు సాయినగర్, డ్రైవర్స్ కాలనీల్లో జరిగిన భూమిపూజ కార్యక్రమాల్లో ఎంపీపీ ఎం.నరసింహులు, ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు ఎన్.విజయభాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్ తదితరులు ముఖ్య అతిధులుగా హాజరై స్థానిక టీడీపీ, జనసేన పార్టీల నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజనీర్ బి.రవీంద్ర, పంచాయతీ కార్యదర్శి ఏ.గౌస్‌సాహెబ్, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ విమల, వార్డు సభ్యులు ఎం.రామాంజినేయులు, పి.నిరంజన్‌గౌడ్, వేల్పుల వాసుదేవుడు, టీడీపీ నాయకులు వేల్పుల శ్రీనివాసులు, పల్లా నరసింహులు, కౌకుంట్ల రవి, ఎం.రాజు, శంకర సుదర్శన్, బి.గోపాల్, వడ్డే లాలుస్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఇంద్రావతి గ్రామంలో 5 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ యర్రగుంట్ల వెంకటేష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించగా పంచాయతీ కార్యదర్శి రమణకుమార్, మాజీ సర్పంచ్ ఓబులేసు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. లత్తవరం పంచాయతీలో 10 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి మాజీ సర్పంచ్ బోదపాటి గోవిందు, ఉప సర్పంచ్ వనకలపాటి లక్ష్మి, ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అసీర్‌బాబు, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జరుట్ల రాంపురంలో చిరుతల సంచారం..!

### - రామప్ప గుట్ట ప్రాంతంలో నాలుగు చిరుతల సంచారం

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త



జరుట్ల రాంపురంలోని రామప్ప గుట్టలో కనిపించిన చిరుత

నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం గ్రామంలో చిరుతల సంచారంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంలోని రామప్పగుట్టలో ఏకంగా నాలుగు చిరుతలు కనిపిస్తుండటంతో పొలం పనులకు వెళ్లాలంటేనే జంకాల్సి వస్తోందని బెంబేలెత్తిపోతున్నారు. చిరుతలు ఆకలి తీర్చుకోవడానికి గొర్రెలు, కుక్కలు, ఆవులను ఎత్తుకెళుతున్నాయని చెబుతున్నారు. రామప్ప గుట్ట జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోనే ఉండటంతో ఆలయానికి వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. 3 రోజుల క్రితం గుట్టలో నాలుగు చిరుతలు కనిపించగా ఆదివారం ఒక చిరుత కనిపించిందని చెబుతున్నారు. జరుట్ల రాంపురం పరిసరాల్లో చిరుతల సంచారం కొత్తేమీ కాకపోయినా గడిచిన కొన్ని సంవత్సరాలు వాటి జాడేలేదని మళ్లీ ఇప్పుడు ఏకంగా 4 చిరుతలు కనిపిస్తుండటంతో అవిఎప్పుడు ఎవరిపైదాడికి దిగుతాయోనని భయమేస్తోందని అంటున్నారు. చిరుతలు ఆకలిగా ఉన్న సమయంలో కొండ గుట్ట ప్రాంతంలో కుక్కలు, గొర్రెలు, ఆవులు, ఇతరత్రా జంతువులు కనబడని సమయంలో అవి ఊళ్లోకివచ్చే అవకాశాలు ఎక్కువగాఉన్నాయని అంటున్నారు. అటవీశాఖ అధికారులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా వ్యవహరించకుండా చిరుతలను బంధించడానికి బోన్లు ఏర్పాటు చేసి వాటిని జూలకు తరలించాలని గ్రామ సర్పంచ్ తిరుపాల్ యాదవ్ కోరారు.

## 16 నుంచి అంగన్‌వాడీ పోస్టుల భర్తీకు ఇంటర్వ్యూలు

### - ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలో ఖాళీగావున్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకు ఈనెల 16వ తేదీ నుండి 18 వరకు రెవిన్యూ డివిజన్ల వారిగా ఇంటర్వ్యూలు జరుగుతాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డా॥బి.ఎన్.శ్రీదేవి తెలిపారు. సోమవారం పీడీ విలేఖరులతో మాట్లాడుతూ 16న అనంతపురం రెవిన్యూ డివిజన్‌లో, 17న కళ్యాణదుర్గం రెవిన్యూ డివిజన్‌లో, 18న గుంతకల్లు రెవిన్యూ డివిజన్ పరిధిలోని మండలాలల్లోని పోస్టుల భర్తీకు ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. దరఖాస్తు చేసుకొని కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పీడీ సూచించారు.

## ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం రైతులు సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త



భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సాయి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా మ ండలంలోని గొట్లూరు, చిగిచెర్ల, సుబ్బారావు పేట, తుమ్మల పంచాయితీల్లో పల్లె పండుగ కార్యక్రమాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 24 లక్షల రూపాయలతో ఈ ఉపాధిహామీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఉపాధిహామీ నిధుల ద్వారా చేపడుతున్న పండ్ల తోటల పెంపకం, సిసిరోడ్లు, గోకులాలు, ఫారంపాండ్లు, సాగునీటి కాలువల పునరుద్దరణ, వాన నీటి సంరక్షణ కోసం ప్రభుత్వ కార్యాలయ సమయాల్లో రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులను చేపట్టి, తద్వారా గ్రామాల్లోని ప్రజల యొక్క ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగు పరచడం జరుగుతుందన్నారు. పర్యావరణ పరంగా, గ్రామాల్లో మ ౌలిక వసతులు కల్పించి, పల్లె సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వారు తెలిపారు. చిగిచెర్ల గ్రామంలో నాగలక్ష్మి పొలంలో మామిడి మొక్కలను నాటి పనులను విరివిగా చేపట్టాలని తెలిపారు. ఏపిఓ అనిల్‌కుమార్‌రెడ్డి గొట్లూరు గ్రామంలో పాల్గొని రామకృష్ణ పొలంలో చీనీ మొక్కలను నాటారు. అలాగే పంట కాల్వ పూడిక తీయు పనిని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఏపిఓ అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ ఓబిరెడ్డి, టిఏలు చంద్రకళ, నాగేంద్ర, భారతి, లక్ష్మినారాయణ, ఎఫ్ఏలు, గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

## కోడిపల్లిలో పల్లె పండుగ..పనులు ప్రారంభం

అగళి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా కోడిపల్లిలో రోడ్డు నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. ఈ పల్లె వారోత్సవాల్లో ముఖ్యంగా మెటీరియల్ కాంపోనెంట్‌తో సిమెంట్ రోడ్లు, బిటి రోడ్లు, పశువుల షెడ్లు, ఫారంపాండ్లు, భౌండరి ట్రెంచ్‌ల వంటి పనులకు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేసిన పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని పల్లె పండుగ ఉద్దేశ్యం. సోమవారం రోజు ఈ కార్యక్రమం కోడిపల్లిలో ప్రారంభమైంది. మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌జి పల్లిలో 16న ఉదయం 10 గంటలకు రామనపల్లి, 11 గంటలకు అగళి శంకరేశ్వరస్వామి, 12 గంటలకు ఇరిగేపల్లి సచివాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నర్సాంబుది రైతు భరోసా కేంద్రం వద్ద, 4 గంటలకు మధూడి సచివాలయం, 17న ఉదయం 10 గంటలకు బ్యాడిగెర సచివాలయం, మధ్యాహ్నం 2 గంటలకు హెచ్‌డి హల్లి గ్రామ సచివాలయం, 18న ఉదయం 10 గంటలకు కొమరేపల్లి బీర లింగేశ్వర స్వామి దేవాలయం వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు ఆలూడి గ్రామంలో 19వ తేది ఉదయం 10 గంటలకు ఇనగలూరు గ్రామ సచివాలయంలో, మధ్యాహ్నం 2 గంటలకు అల్లికెర గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. కార్యక్రమాలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

## ఘనంగా వీరభద్రస్వామి అగ్నిగుండ మహోత్సవం

అగళి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



అగ్నిగుండంలో నిప్పులు తొక్కుతున్న భక్తులు

మండల పరిధిలోని పురాతన వీరభద్ర స్వామి అగ్నిగుండ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. స్వామి మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించారు. అగ్నిగుండం మహోత్సవంలో ప్రత్యేకత, లింగద వీరయ్య స్వామి, ఉపవాసం ఉండి, ఈ అగ్నిగుండం మహోత్సవంలో పాల్గొంటారు. స్వామిపై భక్తి కీర్తలన అనంతరం లింగద వీరయ్యకు వీరభద్రస్వామి భక్తులు పూలను జోలిగలో పోస్తారు, కానీ స్వామి మహిమ వల్ల ఎలాంటి ఇబ్బంది కలగదు. లింగద వీరయ్యపై పాటలు పాడుతూ వీరభద్ర రౌద్రాన్ని చూపిస్తూ ముందుగా అరటి గెలలను కత్తితో నరికిన అనంతరం లింగద వీరయ్యస్వామి అగ్నిగుండంలో దిగుతారు. ఆ స్వామికి ఎలాంటి ఇబ్బందులు కలగవు. లింగద వీరయ్య అగ్నిగుండంలో దిగిన అనంతరం భక్తులు తండోప తండాలుగా ఉపవాసం ఉండి అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. అగ్నిగుండం కార్యక్రమంలో పాల్గొంటే అంతా మంచే జరుగుతుందని, శుభ్రాలు కలుగుతాయని, కష్టాలు తీరుతాయని దీర్ఘకాలిక రోగాలు నయంఅవుతాయని, వివాహం కానివారికి వివాహాలు జరుగుతాయ ని, ఐశ్వర్యం సిద్దిస్తుందని భక్తుల విశ్వాసం. అగ్నిగుండం కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు అవుతారని ఆలయ మండలి వారు భక్తులకు భోజన వసతిని కల్పించారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్, రాగి వైర్ చోరీ

### - ఎస్సైకు ఫిర్యాదు చేసిన రైతులు

కనగానపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త



ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్, రాగి వైరు ఎత్తుకెళ్లిన దృశ్యం

మండలంలోని తూముచెర్ల గ్రామంలో రైతులు లక్ష్మినారాయణ ముత్యాలప్ప రమణ వీరు వ్యవసాయ పొలంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని ఆయిల్ అలాగే రాగి వైర్లను చోరీచేశారని బాధిత రైతులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఇషాక్ బాషాకు ఫిర్యాదు చేశారు.

## లిక్కర్ లక్కంటే ఆయనదే.. 20లో

### - 5 మద్యం షాపులు కైవసం చేసుకున్న సందిరెడ్డి

ధర్మవరం రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త

ధర్మవరం నియోజకవర్గం వ్యాప్తంగా 20 మద్యం షాపులు ప్రభుత్వం కేటాయించగా ధర్మవరం పట్టణం 10 రూరల్ 2 బత్తపల్లి 3 తాడిమర్రి 1 ముదిగుబ్బ 4 మద్యం షాపులకు 219 మద్యం టెండర్లు వచ్చాయి. సోమవారం పుట్టపర్తిలో శ్రీసాయి ఆరాంలో జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో సందిరెడ్డి శ్రీనివాసులుకి 5 మందు షాపులు కైవసం చేసుకున్నారు.

## ప్రారంభమైన పల్లె పండుగ కార్యక్రమం

### - సిసి రోడ్డుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

అమరాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని గొల్లవారనపల్లి గ్రామంలో నిద్రగట్ట గ్రామంలోన పల్లె పండుగ కార్యక్రమాన్ని సోమవారం ఎంపిడిఒ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హేమావతి పంచాయతీలో 50 లక్షలు, నిద్రగట్టలో 30 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామారావు, ఉపాధి హామీ ఏపిఒ జగదీష్, నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు జయకుమార్, గ్రామ కార్యదర్శి నరేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతకాయప్ప, లావణ్య, సర్పంచు తిప్పేస్వామి, సీనియర్ టిడిపి నాయకుడు కుమార్‌స్వామి, ఎంపిటిసి ఓంకార్‌స్వామి, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు గొల్లమానపల్లి రామచంద్రప్ప, పంచాయతీ అధ్యక్షులు తిప్పజ్జ, మాజీ ఎంపిటిసి శివకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, జనసేన పార్టీ నాయకులు అనిల్‌కుమార్, నిద్రగట్ట సర్పంచు రాధమ్మ లోకేష్, ఇఒఆర్‌డి నాగముని, గ్రామ కార్యదర్శి ఈరన్న, టిడిపి నాయకులు వెంకటరావు, సన్న రంగప్ప, రంగనాథప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించండి

అమరాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

ఏఐటియుసి అనుబంధ సంస్థ అయిన ఆంధ్ర ప్రదేశ్ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి నిత్యం దుర్గంధంతో కూడిన వాతావరణంలో కూడా విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకుండా గ్రామస్థాయిలో సర్పంచులు, నాయకులు తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తే కార్మికులకు దాదాపు 14 నెలల నుండి కొన్ని పంచాయతీల్లో వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేల మంది వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేస్తూ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆరాధ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రప్ప, నరసింహామూర్తి, నరసింహప్ప, వివిధ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

## తుఫాన్ వల్ల వచ్చే ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారిద్దాం

### - మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి మమత

గోరంట్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా డిపిఒ

తుఫాన్ ప్రభావం వల్ల వచ్చే మూడు రోజుల్లో ఎదురయ్యే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలో భాగంగా అన్ని శాఖల అధికారులు వారి వారి పరిధిలోని విభాగాలను అప్రమత్తం చేయాలని ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి మమత మండల స్థాయి అధికారులను ఆదేశించారు. మూడు రోజుల తుఫాన్ ప్రభావం ఎక్కువగా వున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలపై మండల స్పెషల్ అధికారి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఎంపిడిఒ నరేంద్రకుమార్, తహశీల్దార్ మారుతిప్రసాద్, ఇఒ బాబురావు, డాక్టర్లు కళ్యాణి, శృతి, మాధవిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఇరిగేషన్ అధికారులు, చెరువులు, కుంటలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలను పర్యవేక్షించాలన్నారు. వైద్యాధికారులు మండల వ్యాప్తంగా వారంలోపు ప్రసవానికి సిద్ధంగా వున్న గర్భవతులను గుర్తించి వారి పర్యవేక్షణలో వుండాలని ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండల స్థాయిలో రెండు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఎంపిడిఒ నరేంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శివన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ మోహన్, హౌసింగ్ ఏఇ గణేష్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, విద్యుత్‌శాఖ అధికారి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## భూములు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఏవి

### - మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందచేసిన కమ్యూనిస్టు పార్టీ కార్మిక సంఘం

గోరంట్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

మండలంలోని పాలసముద్రం వద్ద వున్న నాసిన్, బెల్ భూ నిర్వాసితులకు 2013లో భూసేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్, ఉద్యోగ అవకాశాల కోసం సంబంధిత అధికారులకు ఆదేశించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల ఆధ్వర్యంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత అధ్యక్షతన మంత్రి సవితమ్మకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ నాసిన్, బెల్ భూనిర్వాసితులు (పాలసముద్రం, కావేటినాగేపల్లి, చిన్నబాబయ్యపల్లి)కు గత మూడు సంవత్సరాల ముందు శరతులు లేకుండా ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పించాలని స్థానిక,జిల్లా అధికారులకు విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. అప్పటితెలుగుదేశం ప్రభుత్వం 2015లో నిర్వాసితులకు తక్కువ పరిహారం ఇచ్చి బలవంతపు భూసేకరణ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేశులు, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, భూనిర్వాసితులు వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, రమీజాబి, గంగమ్మ, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 14-10-2024 PM 11:15 Page 1






## పశువుల్లో ప్రబలుతున్న చర్మంవాపు వ్యాధి

### - ఆటంకంలో పాడిరైతులు

యాదగిరి,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

యాదగిరి జిల్లాలో పాడి ఆవుల్లో ప్రబలుతున్న చర్మగంటు వ్యాధి వలన పలుచోట్ల వేలాది రూపాయల విలువ చేసే పాడి ఆవులు మృత్యువాత పడుతున్నాయి.దీంతో సోమవారం నాటికి జిల్లాలో పలు డజన్ల సంఖ్యలో వ్యాధిబారిన పడిన పశువులకు చికిత్స చేసేందుకు వెటర్నరి వైద్యులు సిబ్బంది వెనుకాడుతుండటంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవటం లేదు.జిల్లాలో ఈమధ్య కాలంలో చర్మగంటు వ్యాధి వలన పలు గ్రామాల్లో పాడి ఆవులు చనిపోయాయి.ఈ వ్యాధి తీవ్రతకు భయపడిన పశుసంవర్ధక శాఖ అధికారులు మరియు వైద్యసిబ్బంది గ్రామాల్లోకి అడుగు పెట్టడానికి భయపడుతున్నారు. పాడి ఆవులు వ్యాధికి గురై రైతుల చేతులు నరికినట్టవు తుండటంతో తమను ఆదుకునే వారికోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పశువులకు ప్రాణాంతకమైన చర్మ గంటు వ్యాధికి చికిత్స అందించే డాక్టర్లు గ్రామాల్లోకి అడుగుపెట్టేందుకు జంకుతున్నారు.వ్యాధి తీవ్రంగా సోకిన పశువులను వాటిపాటికి వదిలివేస్తే త్వరగా చనిపోతాయని వైద్యులు చెబుతున్నారు.ఈ వ్యాధిని అరికట్టే వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవటంతో యాదగిరి జిల్లా రైతులు ఏంచేయాలో తోచక తమ కళ్లెదుటే మూగ జీవాలు ప్రాణాలు వదులుతుంటే చూస్తూ ఊరుకుండిపోతున్నారు.చర్మగంటు వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచి వాటి బాగోగులు చూడాలి.లేకపోతే మిగతా పశువులతో వాటిని కలిపి ఉంచితే ఈవ్యాధి మిగతా జీవాలకు సోకుతుంది. చర్మగంటు వ్యాధి ఉన్న పశువులను ముట్టుకునేందుకు వెటర్నరి సిబ్బంది సాహసించటం లేదు.ఈ కారణం చేత పశువుల వ్యాధి అదుపులోనికి రావటం లేదు.వైద్యులను విధులకు హాజరుపరచాల్సిన అధికార యంత్రాంగం వీరి గురించి పట్టించుకోవటం లేదని రైతు పరణ్ణ ఆరోపించారు.

## కల్బుర్గి జిల్లా జైలులో ఖైదీలకు సకల సౌకర్యాలు

### -జైలునుంచి మొబైల్ విడియోల ద్వారా సహచరులతో సంప్రతిస్తున్న ఖైదీలు

కల్బుర్గి,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

కల్బుర్గి జిల్లా సబ్‌జైల్ ఖైదీల పాలిట స్వర్గధామంగా తయారైంది. తాజా ఉదాహరణగా సోమవారం సదరు జైలునుంచి విశాల్,సాగర్.సోను అనే ఖైదీలు మొబైల్‌ఫోన్ల ద్వారా విడియో కాల్ చేసి తమ సహచరులతో ముచ్చటిస్తున్న దృశ్యాలు బయటపడి వైరల్ కావటంతో జైలు అధికారుల కర్మకాండ వెలుగు చూసింది.ఈజైలులోని అధికారుల కృపా కటాక్షాలతో ఖైదీలు డబ్బుచల్లి తమకు కావాల్సిన సౌకర్యాలను నిరాటంకంగా పొందుతున్నారు. డబ్బు చల్లితే ఇక్కడ ఖైదీలకు మొబైల్‌ఫోన్లు అదీ ఇంటర్‌నెట్ ఉంటే సెల్‌ఫోన్లు చేతుల్లోకి వస్తాయి.గంజాయి యధేచ్ఛగా సరఫరా అవుతుందని ఆరోపణలు వచ్చాయి. ఇప్పటి వరకు బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్‌జైలుకు పరిమితం అయిన మొబైల్‌ఫోన్ల సరఫరా ఇపుడు జిల్లా జైళ్లకు విస్తరించింది.జైలు వార్డెన్ల లంచగొండి తనానికి ఖైదీలు రాచమర్యాదలు పొందుతున్నారు.అండర్‌ట్రయల్స్‌గా ఉన్న అనేకమంది జైలువాసులకు ఇలాంటి సౌకర్యాలు అందుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి.జైలు అధికారుల అవినీతి వలన ఖైదీలు సొంతింటి వాతావరణంలో హాయిగా కాలం గడుపుతున్నారు.

## బెంగళూరు ఆనేకల్ ఏరియాలో పొలాల్లో దాడి చేసిన ఏనుగుల మంద

ఆనేకల్ (బెంగళూరు నగరజిల్లా ),అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు నగరజిల్లాలోని ఆనేకల్ ప్రాంతంలో సోమవారం పలు రైతుల పొలాల్లోకి అడవి ఏనుగుల మంద దాడిచేసి వరిపంటను తొక్కివేశాయి.ఏనుగుల మంద గురించి రైతులకు ముందుగానే సమాచారం అందినప్పటికి అడవి ఏనుగులను పారద్రోలేందుకు అటవీశాఖ అధికారులు కానీ సిబ్బంది కాని అందుబాటులో లేకపోవటంతో రైతులు ఏనుగుల చెంత చేరుకునేందుకు జంకుతున్నారు.ఆనేకల్ లోని కాడనాయకనహళ్లి గ్రామంలో పొలాల్లో తిష్ట వేసిన గజరాజులు అక్కడి జామాయిల్ తోటలోని చెట్లను ధ్వంసం చేస్తూ మేత మేస్తున్నాయి.సుమారు ఏడెనిమిది ఏనుగుల మంద గ్రామంపైన దాడిచేసి పొలాల్లో కోతకు వచ్చిన పెసర,వేరుశనగ,అనపకాయల పంటలను తొక్కివేసి తినేస్తున్నాయి.ఏనుగులను దూరంగా తరిమి వేయాలని గ్రామస్తులు అధికారులకు మనవి చేశారు.బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం చుట్టుపక్కల ఏరియాల్లో ఏనుగుల మంద దాడులు ఇటీవల కాలంలో సర్వసాధారణంగా మారింది.కాడనాయకనహళ్లి గ్రామంలోని ఏనుగుల మందను దూరంగా తరిమివేసేందుకు అటవీశాఖ అధికారులకు ఫోన్లు చేసిన ఎవ్వరూ తమకు సాయంగా రాలేదని గ్రామస్తులు ఆరోపించారు.

## బెంగళూరు నగరంలో అప్పులబాధలకు తట్టుకోలేక కడతేరిన కుటుంబం

### - ఇద్దరు చిన్నారులతో సహా నలుగురు మృతి

బెంగళూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు యలహంక సమీపంలోని సింగనాయకనహళ్లి గ్రామంలో సోమవారం ఒక ఓలా ఆటోడ్రయివర్ అప్పుల బాధకు తాళలేక తన భార్య ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకున్నాడు.బెంగళూరు రూరల్ జిల్లా ఎస్పీ సికె.బాబా తెలిపిన వివరాల మేరకు సింగనాయకన హళ్లిలో గత ఏడు సంవత్సరాలుగా నివాసం ఉంటున్న గుల్బర్గా నివాసులు అవినాష్ భార్య ఇద్దరు పిల్లలతో ఉంటే ఇతడు ఓలా ఆటో డ్రయివరుగా పనిచేస్తున్నాడు. అప్పుల బాధను తాళలేక ఇవాళ ఇతడు తన భార్య పిల్లలను గొంతునులిమి హత్యచేసి ఆతరువాత అతడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగళూరులో బారులో స్నేహితుడి చేతిలో హత్యకు గురైన యువకుడు

### - దుండగుడు అరెస్టు

బెంగళూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరులోని మైసూరురోడ్డు టింబర్‌యార్డ్ లేఔట్‌లో ఆదివారం రాత్రి స్నేహితుడితో మద్యం తాగుతున్న యోగేంద్ర సింగ్ అనే యువకుడు తాగిన మైకంలో గొడవ పడటంతో యోగేంద్రను అతడి స్నేహితుడు ఉమేష్ బీర్‌బాటిల్‌తో మెడపైకి పొడిచి హత్య చేశాడు. దీంతో ఒక్కసారిగా బార్‌లో కలకలం లేవటంతో తోటి మద్యపాన ప్రియులు అక్కడనుంచి ఒక్కసారిగా చెల్లాచెదురు అయ్యారు. ఈసమాచారం తెలుసుకున్న బ్యాటరాయనపుర పోలీసులు స్థలానికి వచ్చి దుండగుడి కోసం గాలించి చివరకు అరెస్టు చేశారు.తాగిన మైకంలో తానే బీర్‌బాటిల్‌తో స్నేహితుడిని పొడిచి చంపానని నిందితుడు చెప్పాడు.పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.

## మంగళూరు జిల్లా బెళ్తంగడిలో నదిలో కొట్టుకుపోయిన యువకుడి కోసం గాలింపు

### - యువకుడి మృతదేహం లభ్యం

బెళ్తంగడి (మంగళూరు జిల్లా ),అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

మంగళూరు జిల్లా బెళ్తంగడి తాలూకా నరియ గ్రామం తోటత్తాడి పిక్కలు నివాసి శివకుమార్ అనే యువకుడు ఆదివారం తన స్నేహితులతో కలసి చేపలు పట్టేందుకు నదివద్దకు వెళ్లగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు.ఇతగాడి కోసం గాలించిన సహచరులు సాయంత్రంకావటంతో వెనక్కి వచ్చారు.పోలీసులు సాయంతో సోమవారం వెతుకులాట జరపగా యువకుడి మృతదేహం నదిలో ఒక దిబ్బలో ఇరుక్కునిపోయి కనిపించింది.జాలర్లు యువకుడి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు.ఈమేరకు బెళ్తంగడి పోలీసు స్టేషనులో కేసు నమోదు అయ్యింది.

## బళ్లారి జిల్లా సండూరు తాలూకా కోసం తుకారం 1200కోట్లు నిధులు తెచ్చారు

### - సిఎం సిద్ధరామయ్య

సండూరు ( బళ్లారి జిల్లా ),అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి



సండూరులో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం సిద్ధరామయ్య

బళ్లారి జిల్లా సండూరు విధానసభ ఉప ఎన్నికలు జరగనుండటంతో కర్ణాటక ప్రభుత్వం సోమవారం సండూరు పట్టణం తాలూకాలో పలు అభివృద్ధి పనులకు సిఎం సిద్ధరామయ్య శంకుస్థాపన చేశారు.ముఖ్యమంత్రి అక్కడ జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ సండూరు ఎంఎల్ఎగా ఈ.తుకారం ఈ నియోజకవర్గం అభివృద్ధి కోసం 1200కోట్ల రూపాయలను మంజూరు చేయించుకున్నారని తెలిపారు.తుకారం మంత్రి సంతోష్ లాడ్ సండూరు అభివృద్ధి కోసం ఇప్పటికే 12వేల గృహాలను పేదలకు పంపిణి చేశారని వీరిద్దరు ఇక్కడి ఛాంపియన్లు అని సిఎం అన్నారు.సండూరును సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ సర్కారు అన్ని విధాల సాయం అందించనుంది.ఈ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా సర్కారు అభివృద్ధి చేస్తుందన్నారు. అక్కడ జరిగిన సాధనా సమావేశంలో పాల్గోన్నపలువురు మంత్రులు సండూరు నుంచి పంపిన తుకారం ఇపుడు బళ్లారి జిల్లా లోక్‌సభ సభ్యుడిగా కేంద్రంలో బళ్లారి జిల్లా సమస్యలను వినిపిస్తారని సిఎం అన్నారు.ఈమధ్యకాలంలో సండూరులో పూర్తయిన 400కోట్ల రూపాయల వివధ ప్రాజెక్టులను సిఎం ప్రారంభించారు.తుకారం లాంటి పనిచేసే నాయకుడిని ఇచ్చిన సండూరు ప్రజలు ఈసారి ఉప ఎన్నికల్లోను కాంగ్రెస్‌ను గెలిపిస్తారని సిఎం విశ్వాసం వ్యక్తం చేశారు.సభలో పలువురు మంత్రులు ఎంఎల్ఎలు పాల్గోన్నారు.

## కాలేజిలో వేధింపులు - కాలేజీలోనే ఆత్మహత్యకు ప్రయత్నించిన మహిళా ప్రొఫెసర్

బెంగళూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి

బెంగళూరు నగరంలోని జయనగర టి బ్లాక్‌కు చెందిన ఒక మహిళా ప్రొఫెసర్ సోమవారం మధ్యాహ్నం తన కాలేజీ గదిలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంది. తిలక్‌నగర పోలీసులు తెలిపిన వివరాల మేరకు టి బ్లాక్‌కు చెందిన శబానా అనే మహిళ అక్కడి ఎస్ఎస్ఎంఆర్‌వి కాలేజీలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తుంది.ఈ ఉపాధ్యాయని ఇవాళ మధ్యాహ్నం ఏమైందోకానీ ఉన్నట్టుండి బ్యాగు నుంచి నిద్రమాత్రల సీసాను బయటకు తీసి నిద్రమాత్రలను మింగింది.దీంతో ఆమె సహచరులు వెంటనే ప్రొఫెసర్‌ను సమీపంలోని ప్రవేటు ఆసుపత్రికి చేర్చారు.అక్కడ ఉపాధ్యాయని చికిత్స పొందుతోంది.కాలేజీ అధికారుల వేధింపులే ఆత్మహత్య చేసుకునేందుకుకారణమైందని సమాచారం తెలిసింది.

## వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నిధుల మళ్లింపు కేసులో మాజీ మంత్రి బి.నాగేంద్రకు బెయిల్ మంజూరు

బెంగళూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి



వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నిధుల మళ్లింపు కేసులో ఇడి చేత అరెస్టు అయిన మాజీ మంత్రి బి.నాగేంద్రకు సోమవారం బెంగళూరు 82వ సిసిహెచ్ కోర్టు జనప్రతినిధుల న్యాయాలయం జామీను మంజూరు చేసింది.దీంతో గత మూడునెలలుగా బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న నాగేంద్రకు బెయిల్ దక్కింది.వాల్మీకి ఎస్టీ కార్పొరేషన్ నుంచి సుమారు 88కోట్ల రూపాయలను తెలంగాణలోని హైదరాబాద్ కు చెందిన డొల్ల కంపెనీలకు నిధులు మళ్లించారన్న ఆరోపణలు రావటంతో ఇడి ఈకేసులో ఎంట్రి చేసి నాగేంద్రను అరెస్టు చేసింది.తనపైన వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ సిద్దరామయ్య మంత్రివర్గంలోని నాగేంద్ర వెంటనే మంత్రిపదవీకు రాజీనామా చేయటంతో ఇడి ఈయన్ని అరెస్టు చేసింది.గత మూడునెలలుగా బెంగళూరు జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. ఇవాళ జనప్రతినిధుల కోర్టు రెండులక్షల రూపాయల పూచికత్తుతో ఇద్దరు ష్యూరిటీతో బెయిల్‌ను మంజూరు చేసింది.నాగేంద్ర పాలిట సోమవారం ఉత్తమమైన ఫలితాన్నిఇచ్చింది.బెయిల్ మంజూరు చేసిన వివరాలను సెంట్రల్‌జైలు అధికారులకు అందిన తరువాతనే ఈయన విడుదల జరుగుతుంది.

## కన్నడ సిన్మాహీరో దర్శన్‌కు బెయిల్ నిరాకరించిన హైకోర్టు

బెంగళూరు,అక్టోబర్ 14,ప్రభాతవార్త ప్రతినిధి



రేణుకాస్వామి హత్యకేసులో గత 125రోజులుగా రిమాండ్‌లో ఉన్న కన్నడ సినీహీరో దర్శన్‌కు హైకోర్టు బెంచ్ సోమవారం బెయిల్ నిరాకరించింది.రేణుకాస్వామి హత్యలో ఎ2 నిందితుడిగా ఉన్న దర్శన్ ఇపుడు బళ్లారి జిల్లా జైల్లో ఉన్నాడు.ఈకేసులో ఎ1 నిందితురాలిగా ఉన్న దర్శన్ సహచ రురాలు పవిత్రాగౌడకు కూడా కోర్టు బెయిల్ నిరాకరించింది.దీతో ఈమె కూడా బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో రిమాండ్ కొనసాగు తోంది.పవిత్రాగౌడకు అశ్లీలమైన మేసేజులు పంపాడన్న అక్కసుతో రేణుకా స్వామిని చిత్రదుర్గనుంచి కిడ్నాప్ చేయించిన హీరో దర్శన్ అతడిని బెంగళూ రు పట్టణగెరెలోని ఒక షెడ్డుకు తన సహచరులతో తెప్పించి చిత్రహింసలు పెట్టి హత్యచేశాడు.ఈకేసులో అనేక సాక్ష్యాధారాలను సేకరించిన కామాక్షిపాళ్య పోలీసులు కోర్టుకు ఛార్జీషీటు సమర్పించటంతో సెషన్సుకోర్టు విచారణ జరిపింది.దర్శన్ తరపున ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ సివి.నాగేశ్ వాదించగా సర్కారు తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్ వాదించారు.రేణుకాస్వామి హత్యకేసు పథకం ప్రకారం జరిగిన హత్యగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆధారాల సమేతంగా కోర్టుకు నివేదించటంతో దర్శన్ లాయర్ చేసిన వాదనలకు కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.రేణుకాస్వామి కిడ్నాప్‌నుంచి అతడి హత్య ఆతరువాత శవాన్ని మాయం చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఇందులో పాల్గోన్న సహచరులు అందరిని విచారణ జరిపిన న్యాయస్థానం చివరికి దర్శన్‌ను బెయిల్‌పైన విడుదల చేస్తే సాక్ష్యాధారాలను నాశనం చేస్తారని ప్రభుత్వం తరపున న్యాయవాది కోర్టు దృష్టికి తేవటంతో న్యాయమూర్తి జైశంకర్ దర్శన్ బెయిల్ గురించి తన తీర్పును రిజర్వు చేశారు.ఇవాళ సాయంత్రం తీర్పును ప్రకటించి దర్శన్‌కు బెయిల్ నిరాకరించారు.దీంతో దర్శన్ బళ్లారి జైలుశిక్ష కొనసాగింపు అయ్యింది.

## మందు అమ్మకాల్లో ఆ నలుగురికి లక్కీ "డ్రా"ప్‌లు

గోరంట్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని నాలుగు వైన్‌షాపులకు 103 మంది డిడిలు తీసిన నేపథ్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన లాటరీ విధానంలో ఎంపిక చేసిన వాటిలో ఒకటి టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్‌కు, ఒకటి బిజెపి నాయకులు లక్ష్మినారాయణకు, మరో రెండు ఈడిగ రవికి లక్కీ డ్రాలో సొంతంచేసుకున్నారు. ప్రధానంగా గోరంట్లపట్టణంలో మూడు, పాలసముద్రంలో వద్ద ఒక వైన్‌షాపుకు సంబంధించి దాదాపు నాలుగు గ్రూపులుగా ఏర్పడి 103 మంది డిడిలు తీసిన నేపథ్యంలో కూటమిలో భాగంగా మంత్రి మద్దతిచ్చిన గ్రూపుకు రెండు వైన్‌షాపులు, స్వచ్ఛందంగా వేసిన ఈడిగ రవికి రెండు షాపులు రావడం జరిగింది. వైన్‌షాపులు దక్కించుకున్న రెండు గ్రూపులు దాదాపు 50పైచిలుకు డిడిలు తీయగా స్థానిక ఎంపి పార్థసారధి వర్గం, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప వర్గీయులు దాదాపు మరో 50 డిడిలు తీసినప్పటికి వారికి ఏ ఒక్క షాపు రాకపోవడంతో నిరాశకు లోనయ్యారు.

## మద్యం దుకాణాల లాటరీ దక్కించుకున్నది వీరే

### - ఉరవకొండ మండలంలో భార్యాభర్తలకు వరించిన మద్యం దుకాణాలు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త




ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 7 మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ పద్ధతి ద్వారా పూర్తి అయింది. అనంతపురంలోని జేఎన్‌టీయూలోగల ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ తీశారు. ఉరవకొండ మండలంలో భార్యాభర్తలు అంగదాల నాగభూషణ, అంగదాల విజయలక్ష్మికు రెండు మద్యం దుకాణాలు వరించాయి. మండలంలో వరుసగా (సంఖ్య: 105, 106, 107, 108, 109) ఐదు మద్యం దుకాణాలను అంగదాల నాగభూషణ, కంద్యాల సూర్యనారాయణ, అంగదాల విజయ లక్ష్మి, ముతులూరు ఎర్రిస్వామినాయుడు, నలబాల మహేష్ దక్కించుకున్నారు. విడపనకల్లు మండలంలో వరుసగా (సంఖ్య 110, 111) రెండు మద ్యం దుకాణాలను బొమ్మయ్యగారి దేవరింటి లింగరాజు, యం.చెన్నకేశవులు దక్కించుకున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలంలో వరుసగా (సంఖ్య 87, 88) రెండు మద ్యం దుకాణాలను ఎలుకమూతి రామాంజినేయులు, మాదిగ అశోక్‌కుమార్ దక్కించుకున్నారు. కూడేరు మండలంలో వరుసగా (సంఖ్య 38, 39, 40) మూడు మద్యం దుకాణాలను రాజనేని రమేష్‌నాయుడు, బి.సోమ శేఖర్, ముత్తల అక్కులప్ప దక్కించుకున్నారు. బెలుగుప్ప మండలంలో (సంఖ్య 132) ఒక మద్యం దుకాణాన్ని వేలూరు హనుమంతరెడ్డి దక్కించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలు ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే (నేడు చివరి రోజు) నడవనుండగా 16వ తేదీ బుధవారం నుండి కొత్త ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి.

## నిబంధనలు అతిక్రమిస్తున్న గురుసాయి పాఠశాలపై చర్యలు తీసుకోండి

### - ఎంఈఓకు విన్నవించిన ఏబీవీపీ నాయకులు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త



ఎంఈఓ హెచ్.ఈశ్వరప్పకు వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తున్న ఉరవకొండ పట్టణంలోని గురుసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ బాగ్ కన్వీనర్ ఎ.నిఖిల్‌తేజ కోరారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ హెచ్.ఈశ్వరప్పకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేవని ఒక బస్సు, వ్యాన్‌లో విద్యార్థుల రాకపోకలను జరుపుతున్నారన్నారు. పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులు పలువురికి అర్హత లేదన్నారు. సమగ్ర విచారణ జరిపి పాఠశాల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## రాయితీ పప్పుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

### - విత్తన పంపిణీ కార్యక్రమంలో ఏవో జి.శుభకర్

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త



పి.కౌకుంట్లలో రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో శుభకర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సిబ్బంది

రైతులు రాయితీ పప్పు శెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి. శుభకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వి.కౌకుంట్ల, రాకెట్ల గ్రామాల్లో సోమవారం ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులుతో కలిసి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీతో అందిస్తున్న పప్పుశెనగ విత్తన పంపిణీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో జి.శుభకర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రానికి రాయితీ పప్పుశెనగ విత్తనం చేరిందని రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు కట్టిన ప్రతి రైతు పప్పుశెనగ తీసుకొని వెళ్లాలన్నారు. వాతావరణశాఖ జిల్లాలో రాబోవు మూడు రోజుల్లో భారీ వర్షాలు ప్రకటించింది కాబట్టి వీలు చూసుకొని విత్తనం వేసుకోవాలన్నారు. వేరుశెనగ పంటను తొలగించాలనుకుంటే మూడు రోజుల తరువాత చేపట్టాలని లేని పక్షంలో పూర్తిస్థాయిలో నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎన్.రామ్మోహన్, సిసింద్రి, క్రాంతి, విశ్వ, సన్నప్పయ్య, ఎర్రిస్వామి, ఎల్లప్ప, ఎంపీటీసీ శ్రీనివాసులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రాంమూర్తి, ఆంజనేయులు, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## సెమిస్టర్ ఫలితాల్లో పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినీల ప్రతిభ

ధర్మవరం రూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ఎస్కే యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినీలు తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ.. మా కళాశాల నుంచి ప్రతిభ కనబర్చి అత్యధిక మార్కులతో విజయం సాధించిన విద్యార్థినీలు వ్రిను అభ్యసించడం గర్వించ దగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా అందరికీ ప్రిన్సిపాల్, డైరెక్టర్ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉపసర్పంచు, వార్డు మెంబర్లతో ఎంపిడిఒ సమీక్ష

గోరంట్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని పంచాయతీల ఉపసర్పంచు. వార్డు మెంబర్లతో స్థానిక ఎంపిడిఒ నరేంద్ర కుమార్ సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశ భవనం లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపిడిఒమాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికోసం మంజూరయ్యే నిధులను సద్వినియోగం అయ్యేలా పనులు చేపట్టాలని ప్రధానంగా తాగునీరు. శానిటేషన్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## తుఫాన్ పట్ల అధికారులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి - ఎంపిడిఒ

అమరాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

మండలంలో తుఫాన్ ప్రభావం పట్ల గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది అప్రమతంగా వుండాలని ఎంపిడిఒ రామారావు పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి నాగముని, ఏఒ ఆరాధ్య సమక్షంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలోను తుఫాన్ ప్రభావం వల్ల నప్రజలు ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా వీధిదీపాలు, మురుగుకాలువలను శుభ్రపర్చడం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పాత ఇళ్లలో నివాసం వున్న ప్రజలకు అండగా వుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు ఈరన్న, నరేష్‌బాబు, సుధాకర్, మహేష్, జీవన్, ఉష, గౌరమ్మ, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

## అమరాపురం మద్యం షాపులను దక్కించుకున్న మారుతిప్రసాద్

అమరాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



ఎమ్మెల్యే, మాజీ ఎంఎల్‌సిలను సన్మానిస్తున్న దృశ్యం

అమరాపురం మండ లానికి చెందిన రెండు మద్యం షాపులను పుట్టపర్తిలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేయగా తెలుగుదేశం పార్టీ మండల అధికార ప్రతినిధి మారుతిప్రసాద్ భార్య పిఎం పంకజ 83వ షాపు, మారుతిప్రసాద్ కుమారుడు పిఎం సచిన్ 84 షాపును దక్కించుకున్నారు. ఈరెండు మద్యంషాపులకుగాను 32 మంది దరఖాస్తులు వేసినట్లు సమాచారం. అనంతరం మడకశిరలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్‌సి గుండుమల తిప్పేస్వామిని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, రాష్ట్ర ఒక్కలిగ సాధికారిక చైర్మన్ విఎం పాండురంగప్ప, మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షులు నాగరాజు, మైనార్టీ నాయకుడు దాదాపీర్, తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిరంగనాథ ఆలయానికి శిరగం ఫ్యామిలీ రూ.50వేలు విరాళం

### - సంగాల శ్రావణి, ప్రసన్న దంపతులు రూ.10 వేలు విరాళం

గోరంట్ల, అక్టోబర్ 14 ప్రభాతవార్త



విరాళాలు అందచేస్తున్న దాతలు

గోరంట్ల మండం వానవోలు గ్రామంలోని అతిపురాతనమైన శ్రీకస్తూరిరంగనాథ స్వామి దేవాలయం జీర్ణోద్ధరణ కోసం వానవోలు పంచాయతీ గుంటిపల్లి గ్రామస్తులు కీర్తిశేషులు శ్రీశిరగం వెంకటరంగారెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య రామకృష్ణమ్మ, కుమారులు, కుటుంబసభ్యులు తమవంతుగా 50,116 రూపాయల విరాళాన్ని ఆలయ అర్చకులు శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు. ఒడిసి మండలం బాబాసాహెబ్‌పల్లి గ్రామానికి చెందిన సంగాల శ్రావణి, ప్రసన్నకుమార్ దంపతులు తమవంతుగా 10,116 రూపాయల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందచేశారు. ఇరు కుటుంబసభ్యులకు శ్రీకస్తూరిరంగనాథస్వామి ఆశీస్సులు వుండాలని ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఆకాంక్షిస్తూ కృతజ్ఞతలు తెలియచేశారు.

## పల్లె పండుగ ప్రగతికి అండ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని చేనేపల్లి గ్రామంలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని మండల టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు పంచాయతీల అభివృద్ధిలో భాగంగా పల్లె పండుగ ప్రగతికి అండగా అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మొదలు పెట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా చేనేపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో చిలమత్తూరు జనసేన మండల కన్వీనర్ చిన్నప్రవీణ్, మండల ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్‌మూర్తి, గోపినాథ్, కార్యదర్శులు కిరణ్, సంయుక్త కార్యదర్శులు రంగనాథ్, రాజశేఖర్, బిసి మహేష్ సిపి షఫి, రాము, సుబ్బు, హరి, మోహన్, వినోద్, జగదీష్, గోవర్ధన్, సురేష్, బండి రమేష్, టిడిపి నాయకులు, మండల అధికారులు, పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బి.నాగేంద్రకు బెయిల్ మంజూరు

### - బళ్లారిలో అభిమానుల సంబరాలు

బళ్లారి, అక్టోబర్14, ప్రభాతవార్త;





మాజీ మంత్రి బి.నాగేంద్ర రాయల్ సర్కిల్‌లో అభిమానుల సంబరాలు

మాజీ మంత్రి బి.నాగేంద్రకు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ వర్గాల అభివృద్ధి సంస్థ నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టు అయ్యి బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఉన్న మాజీ మంత్రి బి.నాగేంద్రకు రూ.2 లక్షల బాండు, ఇద్దరు షూరిటీల మేరకు బెంగళూరులోని 82వ సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తి సంతోష్‌గజాననభట్ బెయిల్ మంజూరు చేశారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి సంస్థకు చెందిన నిధుల దుర్వినియోగం కేసుకు సంబంధించి నాగేంద్రను జూలై 12వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈ.డి.) అధికారులు అరెస్టు చేయడం విధితమే. కాగా బళ్లారిలో నాగేంద్రకు బెయిల్ మంజూరైన సమాచారం తెలియగానే ఆయన అభిమానులు, మద్దతుదారులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన పదాధికారులు వందల సంఖ్యలో నగరంలోని వివిధ కూడళ్లలో చేరి పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి, మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు జరుపుకోవడం కనిపించింది. కేపీసీసీ మీడియా ప్రతినిధి వెంకటేష్‌హెగడే మాట్లాడుతూ బళ్లారి రూరల్ క్షేత్రం ఎమ్మెల్యే, మాజీ మంత్రి బి.నాగేంద్ర సదరు కేసు నుంచి నిర్దోషిగా బయటపడతారని, న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడం, క్షేత్రంలోని ప్రజలను సంతోష సంబరాల్లో ముంచెత్తిందని, ఇక క్షేత్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా తమ నాయకుడు నాగేంద్ర కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

